ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

ఆదివారం 11 ఆగస్టు 2024

చెత్త.. ఇకపై సంపద

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తిరిగి ప్రారంభించాలని భావిస్తోంది. వీటిని 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రారంభించింది. గ్రామాలలో రీతడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించేవారు. అక్కడ చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేసి, రైతులకు విక్రయించేవారు. తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరేలా ఈ పథకానికి రూపకల్పన చేశారు. ఈ కేంద్రాల నిర్మాణానికి లక్షలాది రూపాయల ఉపాధి హామీ పథకం నిధులను వెచ్చించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. - కదిరి అర్బన్



కొత్తచెరువులో నిరుపయోగంగా ఉన్న చెత్తతో సంపద కేంద్రం

వైసీపీ హయాంలో నిధులు లేక నిర్వీర్యం

అక్టోబరు 2న పునః ప్రారంభానికి చర్యలు

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 467 గ్రామ పంచాయతీలకు గానూ 416 పంచాయతీల్లో సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ నియమించిన హరిత రాయబారులకు గతంలో స్వచ్ఛాంధ్ర మిషన్ నుంచి జీతాలు చెల్లించేవారు. కొన్నాళ్ల తరువాత పంచాయతీలే వారికి జీతాలు చెల్లించేలా వైసీపీ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. పంచాయతీలలో నిధులు లేమి కారణంగా హరిత రాయబారులకు జీతాలు చెల్లించలేకపోయారు. ఈ క్రమంలో చెత్త సంపద కేంద్రాల నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణ మరుగునపడ్డాయి. కొన్ని మేజర్ పంచాయతీలలో అరకొర సేవలు అందుతున్నాయి.



కొత్తచెరువు వీధుల్లో పేరుకుపోయిన చెత్త.. మూలన పడ్డ ట్రై సైకిళ్లు..

అక్టోబరు 2 నుంచి..

కూటమి ప్రభుత్వం సంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు కార్యాచరణను సిద్ధం చేసింది. అక్టోబరు 2 గాంధీ జయంతిని పురస్కరించుకుని వీటిని పునఃప్రారంభించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన నివేదికలను మండల స్థాయి అధికారులు సిద్ధం చేస్తున్నారు. పంచాయతీల ఆధ్వర్యంలో సంపద కేంద్రాలు పనిచేస్తాయి. తడి, పొడి చెత్తను వేరు చేసి, వర్మీ కంపోస్టు తయారు చేసి, రైతులకు తక్కువ ధరకు విక్రయిస్తారు.



మడకశిర మండలం మెళవాయి పంచాయతీ కేంద్రంలో నిరుపయోగంగా చెత్తతో సంపద కేంద్రం

కార్యాచరణ రూపొందించాం..



ప్రభుత్వ ఆదేశాలతో సంపద కేంద్రాలను శుభ్రం చేయిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 467 పంచాయతీల పరిధిలో 416 సంపద కేంద్రాలు ఉన్నాయి. ఇందులో దాదాపు 72 దాకా వినియోగంలో ఉన్నాయి. మిగిలిన వాటిని వినియోగంలోకి తేచ్చుందుకు చర్యలు చేపడుతున్నాం. ఆయా పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే ఆదేశాలిచ్చాం.

- విజయ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి

పాలకుల నిర్లక్ష్యమే శాపం..



బూరుగుపల్లి పంచాయతీలో గతంలో చెత్త సంపద కేంద్రం ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల చెట్లు నాటి సుందరీకరణ చేశారు. గ్రామాల నుంచి చెత్త సేకరించి ఇక్కడ ఎరువులు తయారు చేసేవారు. రైతులకు తక్కువ ధరకు విక్రయించేవారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఈ కేంద్రాలు మూలపడ్డాయి. నిర్వాహణకు నిధులు లేక వాటిని పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటికి పూర్వ వైభవం రానుంది. ప్రభుత్వం, అధికారుల సహకారంతో త్వరలో వినియోగంలోకి తేస్తాం.

- భాస్కర్, సర్పంచ్, బూరుగుపల్లి

ప్రజల ఆరోగ్యంతోనే దేశాభివృద్ధి

మంత్రి సత్య కుమార్ యాదవ్

ధర్మవరం, ఆగస్టు 10: ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా జిల్లాలోని ఐదు పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ట్రాక్టర్లను కేటాయించింది. వీటిని స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో బత్తలపల్లి మండలం సంజీవపురం, మాల్యవంతం, ధర్మవరం మండలంలోని మల్లాకాల్వ, రావులచెరువు, తాడిమర్రి మండలం దాడితోట పంచాయతీలకు మంత్రి శనివారం అప్పగించారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలు వీధులను శుభ్రంగా ఉంచేందుకు ముందుకు రావాలని మంత్రి కోరారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయొద్దని అన్నారు. ట్రాక్టర్లు వచ్చినప్పుడు చెత్తను వాటిలో వేయాలని కోరారు. జాతిపిత మహాత్మాగాంధీ స్ఫూర్తితో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిరాటంకంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతంకాటమయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛ భారత్ ట్రాక్టర్‌లను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

■ ఖాద్రీశా.. కరుణించు..!






స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు, ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించిన దృశ్యం

కదిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. శ్రావణ మాసం మొదట శనివారం కావడం, శని, ఆదివారం సెలవు దినాలు కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. దీంతో దర్శనానికి గంటలతరబడి క్యూ లైన్‌లలో భక్తులు వేచి చూడాల్సి వచ్చింది. దూర ప్రాంతాల నుంచి శుక్రవారం రాత్రికే చాలామంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు. తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆయల ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించారు. భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదాన్ని అందజేశారు. - కదిరి

■ ప్రసన్నాంజనేయా.. పాహిమాం..!



ఉత్సవ విగ్రహం ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు



అన్నదానం చేస్తున్న కందికుంట

పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో మొదటి శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదానానికి రూ.లక్ష విరాళం సమర్పించారు. ఈఓ రవీంద్రరాజు, అర్చకులు ఆయనను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదానం చేశారు. భక్తుల సౌకర్యార్థం కదిరి డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పించింది. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని భక్తులు ఊరేగించారు. - నల్లచెరువు

■ వెంకట రమణా.. సంకట హరణా..



శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని హిందూపురం పట్టణంలోని పేట వెంటకరమణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

- హిందూపురం అర్బన్

ప్రత్యేక అలంకరణలో వేంకటరమణుడు

■ అలరించిన స్వరమాధురి





ర్యాలీగా వస్తున్న బాల వికాస్ చిన్నారులు.. పాటలు పాడుతున్న భక్తులు

పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో ఏలూరు భక్తులు స్వరమాధురి సంగీత, గాన కచేరీ నిర్వహించారు. పుట్టపర్తి యాత్ర పేరిట వారు శనివారం ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. ఏలూరు సేవా సేవాదళ్ భక్తులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. బాలవికాస్ చిన్నారులు సత్యసాయి పంచ సూత్రాలను ప్రచారం చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస గురించి తెలియజేస్తూ.. జెండాలు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం భక్తులు స్వరమాధురి పేరిట సత్యసాయి ప్రేమతత్వంపై భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. - పుట్టపర్తి

బందిఖానా వీడేనా!

లేపాక్షి హబ్ భూములపై చర్చ



- 15 ఏళ్ల కిందట పరిశ్రమల పేరిట సేకరణ
- బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందిన సంస్థ
- ఉద్యోగాలు వస్తాయని నమ్మి మోసపోయిన రైతులు
- కూటమి ప్రభుత్వం చిక్కుముడి విప్పితే.. జిల్లా అభివృద్ధి



లేపాక్షి హబ్ భూములు

పుట్టపర్తి, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): 'సైన్స్ అండ్ టెక్నాలజీ పార్కులు వస్తాయ్. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థలొస్తాయ్. ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ వస్తుంది. మీ ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా మారుతుంది. మీ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయ్. మీ జీవితాలు మారిపోతాయ్..' అని అన్నారు. జనం నిజమే అనుకున్నారు. జిల్లా సరిహద్దులో, 44వ నంబరు జాతీయ రహదారికి ఇరువైపులా వేలాది ఎకరాల భూములను సేకరించారు. సరిగ్గా 15 ఏళ్ల కిందట లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరిట ఈ హంగామా చేశారు. భూములిస్తే యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అరచేతిలో వైకుఠం చూపిన అప్పటి సీఎం వైఎస్సార్. ఈ వ్యవహారం మొత్తం ఆయన కుమారుడు జగన్ కనుసైగల్లో సాగింది. ఆయన కుటుంబానికి సన్నిహితమైన ఇందూ గ్రూప్‌నకు అనుబంధంగా పవిత్ర లేపాక్షి పేరిట రైతుల నుంచి కారుచౌకగా భూములను లాగేసుకున్నారు. అప్పటి వరకూ సేద్యమే జీవనాధారంగా బతుకుతున్న రైతులకు తీరని అన్యాయం చేశారు. పరిశ్రమలు తీసుకురాకపోగా, వివిధ బ్యాంకుల్లో భూములను తాకట్టుపెట్టి రూ.వేల కోట్ల రుణాలను లేపాక్షి హబ్ తీసుకుంది. అప్పటి నుంచి లేపాక్షి హబ్ భూముల చిక్కుముడి వీడలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా భూములను వినియోగంలోకి తీసుకురావాలని, పరిశ్రమలను తెప్పించి తమ ప్రాంతాన్ని ఆదుకోవాలని రైతులు, ప్రజలు కోరుకుంటున్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

చిక్కుముడి వీడేనా..

ప్రత్యేక ఆర్థిక మండళ్ల పేరుతో 2006లో చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో భూమములను ఏపీఐఐసీ సేకరించింది. పరిశ్రమల ఏర్పాటు కోసం అని చెప్పింది. అలా సేకరించిన 8844 ఎకరాలను లేపాక్షి హబ్‌కు విడతల వారిగా 2009లో కట్టబెట్టింది. ఇందులో 6313 ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయి. డీకేటీ భూమికి ఎకరానికి రూ.1.75లక్షలు, నీటివసతి ఉంటే రూ.2 లక్షలు, ప్రభుత్వ భూమికి రూ.50 వేలు పరిహారం చెల్లించారు. రైతులకు లేపాక్షి హబ్ రూ.119.85 కోట్ల వరకు పరిహారం చెల్లించింది. ఈ భూముల విలువ ఇప్పుడు రూ.20 వేల కోట్లకు చేరింది. రైతుల నుంచి తీసుకున్న భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయక పోగా, వివిధ బ్యాంకుల్లో తాకట్టుపెట్టారు. లేపాక్షికి ఇచ్చిన 8844 ఎకాల్లో 4181 ఎకరాలను తాకట్టు పెట్టి రుణం తీసుకున్నారు. ఆ నిధులను దారి మళ్లించారు.

నిబంధనలు అతిక్రమించారు. ఈ అక్రమాలపై 2013లో సీబీఐ విచారణ చేపట్టింది. అక్రమాలకు పాల్పడిందని నిజమేనని నిర్ధారించి.. 3,800 ఎకరాలకుపైగా భూమిని ఈడీ అటాచ్‌మెంట్ చేసింది. అప్పటి నుంచి విచారణ పేరుతో కాలం వెళ్లదీస్తున్నారు. లేపాక్షి పేరుతో జరిగిన భూ కుంభకోణంపై నాడు దర్యాప్తు చేసిన సీబీఐ తన చార్జ్‌షీట్‌లో మాజీ సీఎం జగన్‌తోపాటు మరికొందరిని నిందితునిగా చేర్చింది. వైసీపీ హయంలోనే మరోమారు ఈ భూములపై జగన్ కన్నేశారు. తాకట్టు పేరుతో కాజేసేందుకు ప్రయత్నించారు. ఢిల్లీ సంస్థ నుంచి కేవలం రూ.5 కోట్లు తీసుకున్న లేపాక్షి హబ్.. రూ.1600 కోట్లకు పైగా విలువ చేసే 2650 ఎకరాలకు భూమి అప్పగించేందుకు సిద్ధమైంది.

అందరి చూపు వాటిపైనే..

బెంగళూరు- హైదరాబాద్ మెట్రో నగరాలను కలుపుతూ పెనుకొండ, కొడికొండ చెక్‌పోస్టు మీదుగా విస్తరించిన నాలుగు వరుసల జాతీయ రహదారిని 12 వరుసలకు విస్తరించాలని కేంద్రం నిర్ణయించింది. మరోవైపు కోడూరు-మేదరమెట్ల, అమరావతి-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం నాలుగు-ఆరు వరుసలతో సాగుతోంది. ఇప్పటికే ముదిగుబ్బ- పుట్టపర్తి మీదుగా కోడూరు దాకా చేపట్టిన 342వ నంబరు జాతీయ దహదారి నిర్మాణం తుది దశకు వచ్చింది. కొండికొండ-శిర మధ్య 544ఈ జాతీయ రహదారి నిర్మాణం పూర్తి అయ్యింది. నాలుగు జాతీయ రహదారులు కొడికొండ, కోడూరు వద్ద అనుసంధానం అవుతున్నాయి. సరిగ్గా ఇదేచోటే లేపాక్షి హబ్ భూములు ఉన్నాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం లేపాక్షి భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదు. పైగా దివాళా పేరిట భూముల్ని ధారాద్తతం చేసేందుకు ప్రయత్నించింది.

టీడీపీ హయాంలో..

లేపాక్షి హబ్ భూబాగోతంపై 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసింది. అప్పులిచ్చిన బ్యాంకులకు లేఖలు రాసింది. చిక్కుముడి విడిపించి, ఆ భూమలను స్వాధీనం చేసుకోవాలని, ఐటీ ఆధారిత పరిశ్రమలు తీసుకురావాలని ప్రయత్నించింది. ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదన నిలిచిపోయింది. పదేళ్లగా రైతులు, ప్రజాసంఘాల ఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయి. లేపాక్షి హబ్ భూములను రైతులకు వెనక్కి ఇవ్వాలంటూ లేపాక్షి నాలెడ్జ్‌హబ్ నిర్వాసిత రైతుల హక్కుల పరిరక్షణ వేదిక, టీడీపీ సహా విపక్షాలు, రైతు సంఘాలు ఉద్యమం బాట పట్టాయి. ఈ అంశం వైసీపీ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది.



భూముల వద్ద ఏర్పాటు చేసిన బోర్డు



లేపాక్షి హబ్ ల్యాండ్ మార్క్

ఇకనైనా మేలు జరిగేనా..?

కేంద్రం, రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉంది. కోరుకున్నట్లుగానే డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటైంది. ఉమ్మడి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు మొదలయ్యాయి. పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. జిల్లాలో జాతీయ రహదారుల విస్తరణ జరగనుంది. వాటి అనుసంధానం పూర్తి అయితే పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా మరింత అనుకూలంగా మారుతుంది. పారిశ్రామిక కారిడార్‌గా అవతరించే అవకాశం ఉంది. కర్ణాటకలోని దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయం లేపాక్షి భూములకు సమీపంలో ఉంది. పెనుకొండ వద్ద కియ, అనుబంధ సంస్థలు, పాలసముద్రం వద్ద బెల్, నాసిన్ ఉన్నాయి. వీటికి తోడు లేపాక్షి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోగలిగితే మరిన్ని పరిశ్రమలు ఈ ప్రాంతానికి వస్తాయి. జాతీయ రహదారికి ఇరువైపులా దాదాపు 10 కి.మీ. లేపాక్షికి కట్టబెట్టిన భూములే ఉన్నాయి. వీటిని త్వరగా విడిపించాల్సిన అవసరం ఉంది.

ఎక్కడ పడితే అక్కడ

ఇష్టానుసారంగా గ్రానైట్ వ్యర్థాల పారబోత

కలుషితమవుతున్న నీరు, మట్టి

ఆందోళనలో చిలమత్తూరు మండల ప్రజలు

చిలమత్తూరు, ఆగస్టు 10: గ్రానైట్ వ్యర్థాలతో మండలంలోని పంట పొలాలు దెబ్బతింటున్నాయి. కోడూరు, దిగువపల్లి తండా పంచాయతీల్లో సుమారు 20 వరకు గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వాటి నుంచి వచ్చే వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండటంతో అవి మట్టిలో చేరి కలుషితమవుతున్నాయి. గ్రానైట్ ముడి రాయిని తీసుకువచ్చి ఈ పరిశ్రమల్లో పలకలుగా కోసి బండలు తయారుచేస్తారు. దాంతో పెద్ద ఎత్తున గ్రానైట్ వ్యర్థాలు ఉత్పత్తి జరుగుతోంది. వ్యర్థాలను రోడ్ల పక్కన, పంట పొలాల్లో, పాడుబడిన వ్యవసాయ బావుల్లో, సాగునీటి చెరువులు, కుంటల్లో పడేస్తూ మట్టి, నీటి కాలుష్యానికి కారణమవుతున్నారు. నీటిలో ఫ్లోరైడ్ శాతం పెరిగి కిడ్నీ జబ్బులు, కీళ్ల నొప్పులు వంటి వాటికి ప్రజలు గురయ్యే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీల కాలుష్యంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు.



రోడ్డు పక్కనే పొలాల్లో గ్రానైట్ వ్యర్థాలు

చర్యలు తీసుకోవాలి



గ్రానైట్ పరిశ్రమల వ్యవర్థాలను నదులు, పొలాలు, చెరువుల్లో వేస్తున్నారు. భూములు తెల్లగా మారిపోయాయి. నీటి కాలుష్యం జరుగుతోంది. ఉద్యోగాలు వస్తాయని అనుకుంటే.. పొలాలు నాశనమౌతున్నాయి. బాధ్యులపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కిష్టప్ప, చిన్నపురెడ్డిపల్లి, చిలమత్తూరు మండలం

ఎక్కడ పడితే అక్కడ..



వర్షం వస్తే వాగుల్లో గ్రానైట్ వ్యర్థాల పొడి కలిసిపోతోంది. పశువులకు నీరు తాపించాలంటే భయం వేస్తోంది. భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- సూర్యనారాయణ, కనిశెట్టిపల్లి, చిలమత్తూరు మండలం

మంత్రి కరుణించినా..!

సమగ్ర శిక్ష ఉద్యోగులకు అందని వేతనం



జిల్లా విద్యాశాఖ కార్యాలయం

కొత్తచెరువు, ఆగస్టు 10: సమగ్ర శిక్ష ఉద్యోగులకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకటో తేదీనే జీతాలు అందినా.. జిల్లాలో మాత్రం పదో తేదీ దాటినా అందలేదు. జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్షలో పీటీటీ, బీఆర్‌సీ, సీఆర్‌సీ, కేజీబీవీలో టీచింగ్, నాన్ టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగులుగా 1,295 మంది పనిచేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వీరికి నెలల తరబడి జీతాలు ఇవ్వలేదు. దీంతో ఉద్యోగులు అప్పట్లో ఆందోళనకు దిగారు. గత ఏడాది డిసెంబరు 20 నుంచి ఈ ఏడాది జనవరి 10 వరకు 22 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేశారు. అయినా అప్పటి ప్రభుత్వం హామీలతోనే సరిపెట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బాధితులు తమ సమస్యలను విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అందులో భాగంగా ఒకటో తేదీనే జీతాలను చెల్లించేందుకు అవసరమైన బడ్జెట్‌ను మంజూరు చేశారు. దీంతో ఉద్యోగులు ఆనందపడ్డారు. అందుకు తగ్గట్టుగానే అన్ని జిల్లాలోనూ ఒకటో తేదీనే వేతన చెల్లింపులు జరిగాయి. జిల్లాలో మాత్రం ఇంకా ఎదురుచూడాల్సి వస్తోంది. సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంలో ఎఫ్ఏఓ పోస్టు ఖాళీగా ఉంద ని, అందుకే వేతన చెల్లింపులు ఆలస్యమయ్యాయని డీఈఓ మీనాక్షి తెలిపారు. ఏడీ-2కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించామని, అనారోగ్యం తో ఆయన సెలవులో ఉన్నారని తెలిపారు. 12వ తేదీలోగా వేతనాలను అందజేస్తామని తెలిపారు.

ఎర్రకోట వేడుకలకు అనంత మెడికోలు



మెడికోలకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పరదేశీనాయుడు

అనంతపురం టౌన్, ఆగస్టు 10: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న ఢిల్లీ ఎర్రకోటలో నిర్వహించే వేడుకలకు అనంత మెడికోలు ఎంపికయ్యారు. జిల్లాలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఏ.జీ పరిణితి సాయి, కె.హర్షశ్రీవిష్ణు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు శనివారం తెలిపారు. వైద్యకళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా ఈ విద్యార్థులు చేపట్టిన సమాజసేవా కార్యక్రమాలు, మేరీ మిట్టి మేరా దేశ్, అమృతవాటిక, రక్తదానం, మొక్కలు నాటే కార్యక్రమం, అవయవదానం, కూచిపూడి, భరతనాట్యం, శాస్త్రీయ సంగీతం తదితర అంశాలలో ప్రావీణ్యతను గుర్తించి ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ నరసింహం, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి వీరిని స్వాతంత్ర వేడుకలకు ఎంపిక చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 20మందిని ఎంపికచేయగా అందులో అనంత వైద్యకళాశాల నుంచి ఇద్దరు మెడికోలు ఉండటం ఆనందకరమన్నారు. ఈ విద్యార్థులు ఈనెల 11న ఢిల్లీకి వెళ్లి రాష్ట్రపతిభవన్ దగ్గర ఇంటర్నేషనల్ యూత్ హాస్టల్స్‌లో 13,14,15వరకు మూడురోజులు ఆతిథ్యం తీసుకుంటారన్నారు. ఢిల్లీలోని ప్రసిద్ధ ప్రదేశాలను చూపిస్తూ, ఆగస్టు 15న జరిగే వేడుకలలో స్పెషల్‌గ్యాలరీలో ప్రత్యేక ఆహ్వానితులుగా కూర్చోబెట్టి సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించే అవకాశాన్ని అక్కడి అధికారులు కల్పిస్తారని వెల్లడించారు. అనంతరం ఉపరాష్ట్రపతి భవన్‌లో జరిగే విందుకు హాజరవుతారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇంతటి అవకాశం రావడానికి కృషి చేసిన ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ పరదేశీనాయుడు, వేడుకలకు ఎంపికైన మెడికోలను ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు అభినందించారు.

దుర్గం విద్యార్థిని...



శ్రీలతకు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్

కళ్యాణదుర్గంరూరల్: ఢిల్లీలోని ఎర్రకోటలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనే అవకాశం ఎస్వీజీఎం డిగ్రీ ప్రభుత్వ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జయరాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్ శ్రీలత ఎర్రకోటలో జరగనున్న మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొననుందన్నారు. ఈ సందర్భంగా శ్రీలతను ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రవిశంకర్, కళాశాల సిబ్బంది అభినందించారు.

గంపమల్లయ్యకు తొలి పూజలు



గుహలోని వెళ్తున్న పూజారి

శింగనమల, ఆగస్టు 10: శ్రావణమాసం తొలి శనివారం ప్రసిద్ధి గాంచిన గంపమల్లయ్య మునీశ్వర్‌కు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ పూజారి గుహలో ప్రవేశం సన్నివేశాలను తిలకించడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మండలంలో ఓ కొండ మీద గుహలో వెలసిన గంపమల్లయ్య మునీశ్వర్ స్వామికి ప్రతి ఏటా శ్రావణ మాసంలో నాలుగు వారాలు భక్తులు మొక్కులు చెల్లిస్తారు. గంపమల్లయ్యస్వామి పూజారి శ్రావణమాసం ప్రతి శనివారం స్వామి వెలసిన చిన్న గుహలోనికి దిగి పూజలు చేయడం ప్రత్యేకత. అయితే 2022లో శ్రావణ మాస పూజల సమయంలో కొండ నుంచి గుహలోనికి ప్రవేశించే సమయంలో పూజారి అదుపు తప్పి జారిపడి మృతి చెందాడు. అప్పటి నుంచి మూడు సంవత్సరాలు పాటు పూజారి కుటుంబ సభ్యులు ఎవరు గుహ ప్రవేశం చేయలేదు. ఈసారి మళ్లీ పూజారి కుటుంబ సభ్యులే గుహ ప్రవేశం చేయడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కొండమీద గంపమల్లయ్యకు పూజలు చేస్తున్న పూజారి

త్యాగాలే స్ఫూర్తిగా నడవండి

ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలి

విద్యార్థులు నాలెడ్జ్ రీడర్స్‌గా కాకుండా ప్రొడ్యూసర్స్‌గా ఎదగాలి

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



నగరంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్





ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 10: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరుల త్యాగాలే స్ఫూర్తిగా నేటి విద్యార్థులు ప్రగతిబాటలో నడవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. హర్‌ఘర్ తిరంగా నినాదంతో బీజేపీ యువమోర్చా ఈ నెల 13నుంచి 15వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా కార్యక్రమాన్ని తలపెట్టింది. ఇందులో భాగంగా శనివారం యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వంశీ ఆధ్వర్యంలో లలితకళా పరిషత్‌లో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా క్లాక్ టవర్ నుంచి లలిత కళాపరిషత్‌వరకు నిర్వహించిన ర్యాలీని మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, హర్‌ఘర్ తిరంగా రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి గౌరవించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. స్వాతంత్ర్యం రాక ముందు కంటే వచ్చిన తరువాత చేసిన బలిదానాలు ఎక్కువన్నారు. స్వార్థ రాజకీయాల కోసం మత ప్రాతిపదికన అఖండ భారతదేశాన్ని హిందూ, ముస్లిం దేశాలుగా విభజించారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల కిందటి వరకూ దేశంలో అనేక ప్రాంతాల్లో బాంబుదాడులు జరిగి వందల మంది పౌరులు మరణించారన్నారు. అయితే ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో వాటిని నిలువరించి సురక్షిత భారతదేశంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి అనేక పథకాలు ప్రధాని మోదీ ప్రవేశపెట్టి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. గూగుల్, యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి ఎన్నో ప్లాట్‌ఫామ్‌లు ఇతర దేశాలు సృష్టించాయని అలాంటి వాటిని సృష్టించేలా ప్రతి విద్యార్థి వారి మేధస్సుకు పదును పెట్టాలని కోరారు. నాలెడ్జ్ రీడర్స్‌గా కాకుండా ప్రొడ్యూసర్స్‌గా ఎదగాలని సూచించారు. నర్సింగ్ కళాశాలల విద్యార్థులతో జాతీయ గీతాలాపన చేయించి జెండాను ఎగురవేయించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరీష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌లు గొంది అశోక్‌కుమార్, బీజేవైఎం ఆజేష్‌యాదవ్, సూర్యప్రకాష్, అశోక్‌రెడ్డి, మంజుల వెంకటేష్, ఎస్సీ మోర్చా శివశంకర్, శాంత కుమార్, ప్రభుకుమార్, ఓబీసీ మోర్చా నాగేంద్రకుమార్, ఎస్టీ మోర్చా రంజిత్ నాయక్, కిసాన్‌మోర్చా తిమ్మారెడ్డి, అసెంబ్లీ కోకన్వీనర్ అంజిబాబుతోపాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



ఆదినారాయణ (ఫైల్)

పామిడి, ఆగస్టు 10: అనంతపురం జిల్లా పామిడి మండల కేంద్రానికి చెందిన రైతు ఆదినారాయణ(39) అప్పుల బాధతో శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని తలవాలకట్ట వీధిలో ఉంటున్న ఆదినారాయణకు రెండు ఎకరాల పొలం ఉంది. మరో నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకున్నాడు. పత్తి, వరి సాగు చేసేవాడు. మూడేళ్లుగా పంటలు సక్రమంగా పండకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. రూ.10 లక్షల వరకూ అప్పులు పేరుకుపోయాయి. దిక్కుతోచని స్థితిలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. ఆదినారాయణకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చీనీమొక్కల కోసం ఉద్యాన క్షేత్రానికి వెళ్లండి

ఉద్యాన శాఖాధికారి అమరేశ్వరి

ధర్మవరం రూరల్, ఆగస్టు 10: మండలంలోని చిగిచెర్ల గ్రామంలో ఉన్న హార్టికల్చర్ ఉద్యాన క్షేత్రంలో వేరుకుళ్ల తెగుళ్లకు తట్టుకునే రంగాపూర్‌నిమ్మమీద అంటుకట్టిన చీనీమొక్కలు అందుబాటులో ఉన్నాయని ధర్మవరం ఉద్యానశాఖాధికారి అమరేశ్వరి శనివారం తెలిపారు. ప్రస్తుతం ఉద్యానవనంలో చీనీమొక్కలకు అంటుకడుతున్నట్లు రు. ఈ రకం చీనీమొక్కలకు తెగుళ్ల బారిన పడకుండా తట్టుకునే శక్తి ఉంటుందన్నారు. ఒక్కో మొక్క రూ.60 ప్రకారం రైతలకు అందజేస్తున్నట్లు అధికారి తెలిపారు. చీనీ మొక్కలు కావాల్సిన రైతులు చిగిచెర్ల ఉద్యాన క్షేత్రానికి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్లాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబరు 9121298862కు సంప్రదించాలని ఆమె తెలిపారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, ఆగస్టు 10: వారాంతపు సెలవులు, స్వాతంత్ర్య దినోత్సవ హాలిడేను పురస్కరించుకుని గుంతకల్లు మీదుగా తిరుపతికి ఆరు ట్రిప్పుల ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి-నాగర్‌సోల్ ప్రత్యేక రైలు (నెం. 07417) ఈనెల 14వ తేదీ ఉదయం 8-15 గంటలకు తిరుపతిలో బయలుదేరి మధ్యాహ్నం ఒకటిన్నరకు గుంతకల్లుకు చేరి, మరుసటి రోజు ఉదయం 10 గంటలకు నాగర్ సోల్‌కు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07418) ఈనెల 15వ తేదీన నాగర్‌సోల్‌లో రాత్రి 10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 4-05 గంటలకు గుంతకల్లుకు చేరి రాత్రి పదిన్నరకు తిరుపతికి చేరుతుందన్నారు. ఈరైలు రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, యర్రగుంట్ల, ముద్దనూరు, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, యాద్గిర్, చిట్టాపూర్, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాదు, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, నాందేడ్, పూర్నా, పర్భని, సేలు, జల్నా, ఔరంగాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. అలాగే తిరుపతి-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు (నెం. 07489) ఈనెల 17వ తేదీన తిరుపతిలో సాయంత్రం 5-15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7-25 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07490) ఈనెల 18వ తేదీన సికింద్రాబాదులో సాయంత్రం 6-10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9-15 గంటలకు తిరుపతికి చేరుతుందని వివరించారు. ఈనౌలే రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, చిట్టాపూర్, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి స్టేషన్ల మీదుగా సికింద్రాబాదుకు వెళ్తుందన్నారు. అలాగే తిరుపతి-నాందేడ్ ప్రత్యేక రైలు (నెం. 07417) ఈనెల 19వ తేదీన తిరుపతిలో సాయంత్రం 5-15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం ఒకటిన్నరకు నాందేడ్‌కు చేరుకుంటుందని తెలియజేశారు. ఈరైలు రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్టా, యాద్గిర్, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాద్, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, ముడ్‌ఖేడ్ స్టేషన్ల మీదుగా గమ్యం చేరుతుందని తెలిపారు.

గుత్తి మీదుగా ప్రత్యేక రైలు

కాచిగూడ-తిరుపతి ప్రత్యేక రైలు (నెం. 07653) ఈనెల 14, 16 తేదీల్లో కాచిగూడలో రాత్రి పదిన్నరకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10-25 గంటలకు తిరుపతికి చేరుతుందని, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07654) ఈనెల 15, 17 తేదీల్లో తిరుపతిలో సాయంత్రం 7-50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం తొమ్మిదిన్నరకు కాచిగూడకు చేరుకుంటుందని తెలిపారు. ఈరైలు ఉమ్దానగర్, షాద్‌నగర్, జడ్చెర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, యర్రగుంట్ల, కడప, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

నెట్టికంటి సన్నిధిలో జైళ్ల శాఖ రాయలసీమ డీఐజీ



నెట్టికంటి సన్నిధిలో పూజలు చేస్తున్న జైళ్లశాఖ డీఐజీ వరప్రసాద్

గుంతకల్లు, ఆగస్టు 10: జైళ్లశాఖ రాయలసీమ, గుంటూరు రేంజి డీఐజీ ఎంఆర్ వరప్రసాద్ శనివారం కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి సన్నిధిలో పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన డీఐజీని సాదరంగా ఆహ్వానించి స్వామివారి దర్శనం కల్పించారు. నెట్టికంటి సన్నిధిలో నామార్చనలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం శాలువతో సన్మానం చేసి, ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో గుత్తి జైలు మహేశ్వరుడు, తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ. 23

అనంతపురం రూరల్, ఆగస్టు 10: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శనివారం 3,750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.16, కనిష్ఠ ధర రూ.9 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 10: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17వేలు, కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 512టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నిండుకుండలా తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్, ఆగస్టు 10: తుంగభద్ర జలాశయం నిండుకుండలా ఉంది. 1633 అడుగులతో 105 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో శనివారం సాయంత్రానికి నాటికి 1633 అడుగులతో 105 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. తుంగభద్ర పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర జలాశయానికి వరదనీరు వచ్చి చేరుతోంది. 40,925 క్యూసెక్కుల నీరు డ్యాంలోకి చేరుతోంది. దీంతో 10 క్రస్ట్‌గేట్లు ఒక్క అడుగు మేర ఎత్తి నది 20,119 క్యూసెక్కులు, 15,370 క్యూసెక్కులు నీటిని కాలువలకు వదులుతున్నారు. బొమ్మనహాళ్ సరిహద్దులోని హెచ్చెల్సీ 105వ కి.మీ. వద్ద 1310 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

జీడిపల్లికి ఇన్‌ఫ్లో 112 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఆగస్టు 10: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం 112 క్యూసెక్కుల కృష్ణాజలాల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటి నిల్వ 0.263 టీఎంసీలు ఉందన్నారు.

ఒక్కడికే ఐదు ఉద్యోగాలు

యాడికి యువకుడిని వరించిన బ్యాంకు కొలువులు



జయకృష్ణ

యాడికి, ఆగస్టు 10: ఒక్క ప్రభుత్వ ఉద్యోగమే రావడం కష్టమైన నేటి రోజుల్లో యాడికికి చెందిన ఓ చేనేత కార్మికుడి కుమారుడు ఏకంగా ఐదు బ్యాంకు ఉద్యోగాలు సాధించాడు. మండలకేంద్రానికి చెందిన పూజారి తిరుపతయ్య కుమారుడు జయకృష్ణ ఇటీవల ఆర్బీఐ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈయన 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు యాడికి ప్రభుత్వ హైస్కూల్‌లో చదివాడు. 2012-2013 పదో తరగతి పూర్తి కాగా ఆర్డీటీ సహకారంతో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశాడు. అనంతపురం, నంద్యాలలో బ్యాంక్ కోచింగ్ తీసుకొని వివిధ బ్యాంకుల్లో ఐదు ఉద్యోగాలు సాధించాడు. 2022లో సౌత్ ఇండియన్ బ్యాంక్ హైదరాబాద్, 2024లో కర్ణాటక గ్రామీణ బ్యాంక్ కర్ణాటక, కెనరా బ్యాంక్ కర్ణాటక, ఎస్‌బీఐ కర్ణాటకలో ఉద్యోగాలు సాధించాడు. ప్రస్తుతం రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బెంగళూరు శాఖలో అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. చేనేత కార్మికుడి కుమారుడు జయకృష్ణ ఇలా వరుసగా ఐదు బ్యాంక్ ఉద్యోగాలు సాధించడంపై స్థానికులు అభినందించారు.

జన హితమే 'వదాన్య' లక్ష్యం

ఇద్దరు ఇంజనీర్ల ఆలోచనల రూపం వదాన్య జన సొసైటీ

ఎంతోమంది విద్యార్థుల ఉన్నత చదువులకు చేయూత

ప్రభుత్వ ఉద్యోగ సాధనలో యువతకు బాసట

సాంకేతికతతో ముందుకు సాగడానికి ల్యాప్‌టాప్‌ల పంపిణీ

18న సొసైటీ వార్షికోత్సవానికి సన్నద్ధం



ప్రభుత్వ పాఠశాలలో టాలెంట్ టెస్టు (ఫైల్)



2023లో నిర్వహించిన టాలెంట్ టెస్టుకు హాజరైన విద్యార్థులు

అనంతపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సమాజం పట్ల బాధ్యత కొందరికే ఉంటుంది. సమాజం మనకు ఏమిచ్చిందనేది కాదు. సమాజానికి మనమేమిచ్చామన్నదే వారి ఆలోచన. ఇలాంటి సేవా గుణం కలిగిన ఇద్దరు ఇంజనీర్ల మదిలో మెదిలిన ఆలోచనల రూపమే వదాన్య జన సొసైటీ. వీరు 2010లో వదాన్య జన సొసైటీని స్థాపించారు. ఆ సొసైటీ ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించారు. ఉన్నత చదువులకు భరోసానిచ్చారు. అంతేకాదు సామాజిక సేవల్లోనూ ఆ సంస్థ తనదైన ముద్ర వేసుకుంది. ఇంతకూ ఆ ఇద్దరు యువ ఇంజనీర్లు ఎవరంటారా..? శ్రీ సత్యసాయి జిల్లాలోని కొత్తచెరువుకు చెందిన అశోక్ పడపాటి ఒకరు కాగా... మరొకరు అతడి మిత్రుడు అరుణ్. సొసైటీ స్థాపించినప్పటి నుంచి సేవా కార్యక్రమాలు విస్తరిస్తూ, సమాజ హితమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఈ నెల 18న సొసైటీ వార్షికోత్సవానికి సన్నద్ధమవుతున్న నేపథ్యంలో... ప్రత్యేక కథనం.

రెండు తెలుగు రాష్ట్రాల్లో సేవలు...

రాష్ట్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో సొసైటీ ఏర్పాటైంది. అప్పటి నుంచి ఆ సొసైటీ నిరుపేద, నిరాశ్రయ, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థికంగానూ, మానసికంగానూ తోడ్పాటునందిస్తోంది. రాష్ట్ర విభజన జరిగినా రెండు తెలుగు రాష్ట్రాల్లో సొసైటీ సేవలందిస్తోంది. నిరుపేద విద్యార్థులకు ఆపన్నహస్తం అందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. సొసైటీ ప్రారంభంలో హైదరాబాదులో కార్యకలాపాలను కొనసాగించినా ఆ తరువాత రెండు రాష్ట్రాల్లోనూ సేవలను విస్తృతం చేసింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో మరింత పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు సొసైటీ ద్వారా ఉన్నత విద్యావంతులతో ప్రత్యేక క్లాసులకు శ్రీకారం చుట్టింది. ఆ విధానాన్ని కొనసాగిస్తూనే ఆర్థికభారంతో పేద విద్యార్థుల చదువులు ఆగిపోకూడదనే లక్ష్యంతో ఉన్నత చదువుల కోసం ఆర్థిక చేయూతనందిస్తోంది. సాంకేతికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో లాప్‌టాప్‌లను ఉచితంగా అందజేసింది. సొసైటీ ద్వారా పోటీ పరీక్షలను నిర్వహించి ఎందరో విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు మార్గం సుగమం చేసింది. ఇప్పటివరకూ దాదాపు 300 మంది విద్యార్థులకు ఆ మేరకు సహాయసహకారాలు అందించారు. 50 మందికిపైగా లాప్‌టాప్‌లు అందించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడం కోసం టాలెంట్ టెస్టులను నిర్వహించడం సొసైటీ ప్రధాన ఉద్దేశ్యం. ఆ క్రమంలోనే ఆ సొసైటీ వ్యవస్థాపకులు అశోక్ పడపాటి నేతృత్వంలో అందులోనూ సొంతగడ్డ కొత్తచెరువులో గతేడాది గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో మరింత నైపుణ్యాన్ని పెంపొందించేందుకుగానూ టాలెంట్ టెస్టులు నిర్వహించింది. ఈ టాలెంట్ టెస్టులో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులు ప్రస్తుతం హైదరాబాదులో ఐఐటీ శిక్షణ అందుకుంటున్నారు. సామాజికసేవలోనూ సొసైటీ తన పాత్రను పోషిస్తోంది. కరోనా సమయంలో ఆర్డీటీ సంస్థకు చేయూతనందించింది. ఆక్సిజన్ కొరతతో ఎవరూ చనిపోకూడదనే లక్ష్యంతో సిలిండర్లను ఆర్డీటీకి అందించి దాతృత్వాన్ని చాటుకుంది.



శ్రీ సత్యసాయి జిల్లా అప్పటి ఎస్పీ మాధవరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు లాప్‌టాప్‌లు అందజేస్తున్న అశోక్ పడపాటి (ఫైల్)

సేవలను మరింత విస్తృతం చేస్తాం: అశోక్ పడపాటి



ఉమ్మడి అనంతపురం జిల్లాలో వదాన్య జనసొసైటీ ద్వారా సేవలను మరింత విస్తృతం చేస్తాం. కరువు పరిస్థితులను దృష్టి లో ఉంచుకొని పేద విద్యార్థులను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా కార్యచరణను రూపొందిస్తున్నాం. డీఎస్సీ నోటిఫికేషన్‌ను దృష్టిలో ఉంచుకొని త్వరలో డీఎస్సీ గ్రాండ్ టెస్టు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 2024 టాలెంట్ టెస్టును ఓఎంఆర్ విధానంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ స్టైఫండ్‌తో పాటు వారు ఏ రంగంలో శిక్షణ కావాలంటే అందులో శిక్షణ ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నాం.

అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక బస్సు

ధర్మవరం,ఆగస్టు 10: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 19న పౌర్ణమి సందర్భంగా అరుణాచలం, కాణిపాకం క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఏర్పాటుచేసినట్టు డిపో మేనేజర్ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం డిపో నుంచి ఈ నెల 18న ఉదయం 6గంటలకు బస్సు బయల్దేరుతుందన్నారు. రానుపోను చార్జీ రూ.1400 అన్నారు. కావున దర్శనానికి వెళ్లే భక్తులు ఆన్‌లైన్ లేదా బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 6303151302, 9959225859 సంప్రదించాలన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన ఓడీసీ నాయకులు


టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావును కలిసిన ఓడీసీ నాయకులు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 10: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును శనివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి బోరు రమణ, మైనార్టీ నాయకులు ఆర్‌ఎంపీ జాకీర్, గండికోట ఇర్షాద్, పొగాకు షాన్వాజ్ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసి దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీకి కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ గుర్తింపు ఇస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు సూచించినట్లు వారు తెలిపారు.

నంద్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదం

కదిరి వాసి మృతి


శంకర్ మృతదేహం

ప్యాపిలి, ఆగస్టు 10: నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కదిరి పట్టణానికి చెందిన శంకర్(34) అనే వ్యక్తి మృతి చెందగా... మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి నుంచి టమోటా లోడుతో ఓ లారీ నాగపూర్‌కు బయలుదేరింది. అయితే ప్యాపిలి మండలంలోని ఏనుగుమర్రి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న మరో వాహనాన్ని ఈ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో క్లీనర్ శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. లారీలో ప్రయాణిస్తున్న రైతు సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమతి లేకుండా వేపచెట్లను తొలగించారు

అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు


ఎక్స్‌కవేటర్‌తో వేపచెట్టును తొలగించిన దృశ్యం

కొత్తచెరువు, ఆగస్టు 10: మండల కేంద్రంలోని ధర్మవరం ప్రధాన రహదారి పక్కన ప్రైవేటు భూమిలో ఉన్న వేప చెట్లను అనుమతి లేకుండా తొలగించారంటూ పర్యావరణ వేత్త భాస్కర్‌నాయుడు అటవీ శాఖ అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓ ప్రైవేటు సంస్థ షోరూం నిర్మాణం కోసం పచ్చని వేప చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారన్నారు. అటవీశాఖ అధికారుల అనుమతి లేకుండా ఏ విధంగా తొలగిస్తారని ప్రశ్నించారు. చెట్లను విచ్చలవిడిగా తొలగిస్తున్నా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. కొందరు అధికారులు మామూళ్లు తీసుకుంటూ... చెట్లను కొట్టివేస్తున్నా చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా చెట్లను కొట్టేవారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

తేలు కాటుతో బాలుడి మృతి


జగదీశ్ (ఫైల్)

కొత్తచెరువు, ఆగస్టు 10: మండల కేంద్రంలోని పాత బీసీకాలనీలో నివాసముంటున్న పాణ్యం హరికృష్ణ, అశ్విని కుమారుడు జగదీశ్(8) తేలు కుట్టి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా తెలిసింది. సీఐ రాజారమేశ్ శనివారం తెలిపిన మేరకు... చిన్నారి జగదీశ్ గత నెల22న బీసీకాలనీలో ఇంటి ఎదుట ఆడుకుంటుండగా కాలికి ఏదో విషపురుగు కుట్టిందని తల్లిదండ్రులకు తెలిపాడు. వారు చికిత్స కోసం అతడిని పుట్టపర్తి జనరల్ ఆస్పత్రికి, సూపర్ స్పెషల్ ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతపురం వైద్యులు పరీక్షించి విషపు తేలు కుట్టిందని బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో వారు ఆర్డీటీకి తీసుకెళ్లారు. అయితే అక్కడి వైద్యుల సూచనల మేరకు బెంగళూర్ ఇందిరా గాంధీ చిల్డ్రన్ ఆస్పత్రికి తరలించగా అక్కడ రెండు వారాల పాటు వైద్య చికిత్సలు అందించారు. అయినా పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతిచెందినట్టు సీఐ తెలిపారు. బాలుడి తాత సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని సీఐ తెలిపారు.

గాలిమరల టెక్నీషియన్ మృతి


వీరేష్ మృతదేహం

బెళుగుప్ప, ఆగస్టు 10: మండలంలోని నక్కలపల్లి గ్రామ సమీపంలో గాలి మరల టెక్నీషియన్ టీ వీరేష్ (32) ప్రమాదవశాత్తూ కిందపడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బళ్లారి జిల్లా సిరిగెర గ్రామానికి చెందిన వీరేష్ ఏడాది కిత్రం సుజలాన్ గాలిమరల కంపెనీలో టెక్నీషియన్‌గా చేరాడు. నక్కలపల్లి సమీపంలో గాలిమరల ఫ్యాన్ పనిచేయకపోవడంతో శుక్రవారం సాయంత్రం మరమ్మతు చేయడానికి పైకి ఎక్కాడు. అక్కడ సమస్యను పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తూ జారి కిందకు పడి తీవ్రంగా గాయపడ్డాడు. సిబ్బంది వెంటనే అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య కనక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

గుండెపోటుతో రైతు మృతి

రాయదుర్గం రూరల్, ఆగస్టు 10: మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన రైతు వన్నూరుస్వామి(53) గుండెపోటుతో శనివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వన్నూరుస్వామి వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. తనకున్న మూడెకరాల పొలంలో గత మూడేళ్ల నుంచి వివిధ పంటలు సాగు చేసి నష్టపోయాడు. ఈ క్రమంలో రూ. 6 లక్షల వరకు అప్పు చేశాడని, వాటిని ఎలా తీర్చాలోనని తరచూ మధనపడుతుండేవాడని, ఈ క్రమంలో శనివారం ఉదయం ఒక్కసారిగా ఇంట్లో కుప్పకూలి పోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య చౌడమ్మ, కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శనివారం పూజలు


అమడగూరులో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



పూజలందుకున్న పిచ్చిలికొండ ఆజనేయస్వామి, మునగలవారిపల్లి గరుడాంజనేయస్వామి


ఓడీసీలోని ఆంజనేయస్వామి

కదిరి, (అమడగూరు),ఆగస్టు 10: మండలంలోని మహమ్మదాబాదులో వెలసిన పిచ్చిలికొండ ఆజనేయస్వామి, అమడగూరులోని అభ యాంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణ మాసం మొదటి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మూలవిరాట్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

గాండ్లపెంట: మండలపరిధిలోని పలు ఆయాల్లో శ్రావణ మాస మొదటి శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని బొల్లగుట్లపల్లి, గాండ్లపెంట, కురమామిడి, వేపరాల, పాయకట్లు, మునగలవారిపల్లి తదితర ఆలయాల్లో అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మునగలవారిపల్లి గరుడాంజనేస్వామికి ఆకుపూజ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

ముదిగుబ్బ: శ్రావణ శనివార సందర్భంగా మండల పరిధిలోని సానేవారిపల్లిలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, ఆకుపూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. టీడీపీ కూటమి నాయకుడు బండి మల్లికార్జున కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఓబుళదేవరచెరువు: మండల వ్యాప్తంగా ఆలయాల్లో శ్రావణమాసం మొదటి శనివారం పూజలను ఘనంగా నిర్వహించారు. ఓడీసీలోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు తోయరాజు స్వామికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు

మొక్కలను నాటి సంరక్షించండి : పీడీ


మొక్కను నాటుతున్న డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్

తాడిమర్రి, ఆగస్టు 10: ఉపాధి కూలీలు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలని డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని నిడిగల్లు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీలతో ఆయన మొక్కలు నాటించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ...కూలీల బకాయి డబ్బులును ప్రభుత్వం త్వరలో చెల్లిస్తుందన్నారు. ప్రతి కూలీ వంద పనిదినాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సంజీవరెడ్డి, ఈసీ అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 10: మండల పరిధిలోని బోరంపల్లిలో వర్షం కోసం గ్రామస్థులు ప్రార్థనలు చేస్తున్నారు. శనివారం స్థానిక అంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవుడి ఫొటోతో భజనలు చేస్తూ ఏడు గ్రామాల్లో పాదయాత్ర చేశారు.

24గంటల విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు

పనులు ప్రారంభించిన ఎంపీపీ, కూటమి నాయకులు


పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

ముదిగుబ్బ, ఆగస్టు10: గ్రామీణ ప్రాంతాలకు 24గంటలు విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చేపట్టే పనులను శనివారం ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ పూజచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.... రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు, గృహాలకు 24గంటల విద్యుత్ సరఫరా అయ్యే విధంగా ప్రభుత్వంతో చర్చించి, చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని జొన్నలకొత్తపల్లి, కమ్మవారిపల్లి, గాండ్లవారిపల్లి, సంకేపల్లి, గుంజేపల్లి తదితర గ్రామాలకు 24గంటల విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సంకేపల్లి మాజీ సర్పంచ్ రమేష్, రంగయ్య, సూరి, గంగాధర్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


వేడుకలలో పాల్గొన్న నాయకులు

ధర్మవరం, ఆగస్టు10: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 51వ ఆవిర్భావదినోత్సవాన్ని పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డితో పాటు నాయకులు హనుమంతరావు, అల్లా బకాష్ జెండాను ఆవిష్కరించి, గీతాన్ని ఆలపించారు. అదేవిధంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. పోటీల్లో 36 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ...1974లోఆగస్టు 10న యూటీఎఫ్ ఆవిర్భవించిందన్నారు. ప్రస్తుతం లక్షమందికి పైగా సభ్యత్వ మున్న ఏకైక సంఘమన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిం చడంలో యూటీఎఫ్ ముందంజలో ఉందన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సుదాకర్, నాయకులు నారాయణ స్వామి, లక్ష్మీనారాఆయణ, శివశంకర్, కిష్టప్ప, సాయిగణేశ్, రామకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంట ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

అగళి, ఆగస్టు 10 : మండలంలోని కింకెర గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు పత్తిపంటను ధ్వంసం చేశారని బాధితుడు నరసింహ రాజు, భార్య శిల్ప ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ 85సెంట్ల భూమిలో పత్తిపంట సాగుచేశామన్నారు. రూ. లక్ష వరకు పెట్టుబడి పెట్టామని, పంట చేతికి వచ్చే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పంట ధ్వంసం చేశారని కన్నీటి పర్యంతమయ్యారు. స్పందించిన ఎస్ఐ వీరేష్ సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన విషయాలను ఆరా తీశారు. 85సెంట్ల పత్తిపంటలో 20 సార్ల వరకు పంట ధ్వంసం చేశారని ఎస్ఐ తెలిపారు. న్యాయం చేయాలని బాధితులు విలపించడం అందరినీ కన్నీరు పెట్టించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


కత్తిరించిన పత్తి పంటను చూపుతున్న బాధితులు

పెన్నహోబిలంలో వైభవంగా పల్లకి సేవ


పెన్నహోబిలంలో ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, ఆగస్టు 10: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. తర్వాత ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. శ్రావణ మాసం మొదటి శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

ఏడు శనివారాల వ్రతం


సామూహిక ఏడు శనివారాల వ్రతంలో పాల్గొన్న మహిళలు

ధర్మవరం, ఆగస్టు 10: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వెలసిన లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఐదో శనివారం ఏడు శనివారాల వ్రతాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రాజేశ్ మూలవిరాట్‌కు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు ఏడు శనివారాల వ్రతాన్ని ఆచరించారు. ప్రతి యేటా ఆలయంలో ఈ వ్రతాన్ని మహిళలు ఆచరిస్తారని అర్చకులు రాజేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీశ్వరప్రసాద్, ప్రధానకార్యదర్శి జింకారాజేంద్రప్రసాద్, సభ్యులు చెన్నంశెట్టి శ్రీనివాసులు, చెన్నంశెట్టి రమేశ్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్


కంప్యూటర్ గదిని ప్రారంభించిన మాంచోఫెర్రర్

ధర్మవరంరూరల్, ఆగస్టు10: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఒలంపిక్స్ స్థాయికి ఎదగాలని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో పెర్రర్ పేర్కొన్నారు. పట్టణంలోని తారకరామాపురం వద్ద ఉన్న ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో శనివారం దాత ప్రేమ్ సహకారంతో నిర్మించిన కంప్యూటర్ కమ్ లైబ్రరీ రూమ్‌ను దాతతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాంచో పెర్రర్ మాట్లాడుతూ... నేటి సమాజంలో విద్యార్థులందరికి చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. దేశంలోని గ్రామీణ క్రీడాకారులు ఎందరో ఒలంపిక్స్ స్థాయికి ఎదగారని గుర్తుచేశారు. కంప్యూటర్ కమ్ లైబ్రరీ నిర్మాణానికి సహకరించిన దాత ప్రేమ్‌ను అభినందించారు. ప్రతిఒక్కరు సహాయం చేసే గుణాన్ని అలవరచుకోవాలన్నారు. అప్పుడే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బత్తలపల్లి రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఏరియా టీం లీడర్ శ్రీనివాసులు, కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాలను తాకే అర్హత లేదు

- వైసీపీ నాయకులపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ధ్వజం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మడకశిర టౌన్, ఆగస్టు 10 : ఐదేళ్ల వైసీపీ పాలనలో మాజీ సీఎం జగన్ రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారని, దళితులను మోసం చేసిన ఆ పార్టీ నాయకులకు అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత లేదని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మడకశిర పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విజయవాడ ప్రధాన సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం జగన్ పేరు ఉన్న శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారన్నారు. ఆ నిందను ముఖ్యమంత్రి చంద్రబాబుపై నెట్టడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. అమరావతిలోని అంబేడ్కర్ స్మృతి వనంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయం మీకు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. విజయవాడలో రూ.170 కోట్లతో చేపట్టిన అంబేడ్కర్ విగ్రహం ఖర్చు రూ.404 కోట్లకు చేరిందని, అప్పట్లో రూ.258 కోట్లు వైసీపీ నేతలు స్వాహా చేసినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అంబేడ్కర్ విదేశీ విద్య పేరుతో పేద విద్యార్థుల అభివృద్ధి కొరకు ప్రవేశపెట్టిన పథకాన్ని ఆపేసి అన్యాయం చేశారన్నారు. దళితుల పథకాలను రద్దు చేసి మోసం చేశారని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సోషల్ మీడియా, సొంత ఛానళ్లలో దళితుల మనోభావాలను రెచ్చగొట్టే విధంగా ప్రయత్నిస్తున్నారని, అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు నమ్మరన్నారు.

భార్యపై భర్త దాడి

తాడిపత్రి, ఆగస్టు10: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్న నాగరత్నపై శనివారం భర్త నాగార్జున కర్రతో దాడిచేసి గాయపరిచాడని పోలీసులు తెలిపారు. మద్యం తాగడానికి భార్య డబ్బులు ఇవ్వడం లేదన్న కోపంతో నాగరత్నపై నాగార్జున కర్రతో దాడిచేసి గాయపరిచాడని, చికిత్స నిమిత్తం ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు చోరీపై కేసు నమోదు

గోరంట్ల, ఆగస్టు 10: కారు చోరీపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పాలసముద్రం సమీపంలోని కుబేరా హిల్స్‌లోని కోరియాన్ రెస్టారెంట్ వద్ద ఈనెల 8న రాత్రి కోరియాకు చెందిన వ్యక్తి రూ.14లక్షల విలువ చేసే కియా కారును ఉంచారు. రెండు రోజులు గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెస్టారెంట్ మేనేజర్ శ్రీకాంత్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

తగ్గుతున్న యాప్‌ల భారం

- మరుగుదొడ్ల యాప్ తీసేయడంతో ఉపాధ్యాయుల హర్షం
- ఇంకా ఆన్‌లైన్ వర్క్ తగ్గించాలని విన్నపం


కదిరి బాలికల ఉన్నత పాఠశాల

కదిరి, ఆగస్టు 10: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు గత వైసీపీ ప్రభుత్వంలో బోధనే కాకుండా బోధనేతర పనులే ఎక్కువగా నిర్వహించారు. ముఖ్యంగా పాఠశాల నిర్వహణకు సంబంధించిన పలు విషయాలపై రోజూ సంబంధిత యాప్‌లలో ఫొటోలు తీసి, ఆప్‌లోడ్ చేయాల్సి ఉండేది. దీని ఉపాధ్యాయులు ఎక్కువ సమయం కేటాయించారు. అయితే ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మొట్టమొదటగా ఉపాధ్యాయుల గౌరవాన్ని తగ్గించేలా మరుగుదొడ్ల ఫొటోలను తీసి అప్‌లోడ్ చేసే యాప్‌లను తొలగించింది. దీనిపై ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా మధ్యాహ్న భోజనం యాప్‌ను, ఆన్‌లైన్ వర్కును తగ్గించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పెరిగిన ఉపాధ్యాయుల గౌరవం

గత ప్రభుత్వం ఉపాధ్యాయ వృత్తికి సంబంధంలేని మరుగుదొడ్ల యాప్‌ను తీసుకొచ్చి, వారిచేత ఫొటోలు ఆప్‌లోడ్ చేయించింది. దీన్ని ఉపాధ్యాయులు ఎంతో అవమానకరంగా భావించారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులైతే మరుగుదొడ్ల ఫొటోలు తీయడంతోపాటు, ఇతర యాప్‌లతో పనిచేయాల్సి ఉంటుందని, ఇంత చదివి మరుగుదొడ్ల ఫొటోలు తీస్తున్నారని గ్రామాల్లో పలువురు ఎద్దేవా చేసిన కాలం కూడా ఉంది. మరుగుదొడ్ల ఫొటోలు తీయడానికి గతంలో ఉన్నతపాఠశాలలో రోజుకొక్కరు చొప్పున ఉపాధ్యాయులు వంతులు వేసు కునేవారు. పాఠశాలకు వస్తూనే ప్రధానోపాధ్యాయుడితో పాటు, ఉపాధ్యాయులు చేయాల్సిన మొట్టమొదటి పని మరుగుదొడ్ల ఫొటోలు తీయడమే. ఇది ఉపాధ్యాయులకు ఎంతో ఇబ్బందిగా ఉండేది. కూటమి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండు నెలల్లోపే మొదటిసారి మరుగుదొడ్ల ఫొటోలు తీసే పనిని తొలగించి, తమ గౌరవాన్ని పెంచిందని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఇంకా ఆన్‌లైన్ భారం ఉంది

గత ప్రభుత్వ హయాం నుంచి ఉపాధ్యాయులు బోధనకన్నా, బోధనేతర పనులకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. ప్రధానోపాధ్యాయులైతే రోజంతా యాప్‌ల తోనే కుస్తీ పడుతున్నారు. ఉపాధ్యాయులు ఆన్‌లైన్ వర్క్ తోనే సతమతమవు తుంటారు. విద్యార్థుల చేరిక నుంచి, మార్కుల జాబితాలు ఆప్‌లోడ్, విద్యార్థుల పనితీరు, ఇలా రకరకాల వాటితో ఆప్‌లోడ్ చేయిస్తూనే ఉంటారు. దీంతో ఉపాధ్యాయులు పిల్లలకు చదువు చెప్పడంకంటే సెల్‌ఫోన్లలో వచ్చిరాని నెట్ వర్క్‌తో కుస్తీలు పడుతుంటారు. దీన్ని చూసిన గ్రామీణ ప్రజలు నిత్యం సెల్‌ఫోన్లలోనే ఉంటారని, పాఠాలు చెప్పరని ఉపాధ్యాయులతో ఘర్షణలు పడిన సంఘటనలున్నాయి. దీన్ని గమనించిన కూటమి నాయకులు ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తొలగిస్తామని ఎన్నికల సమయంలో వాగ్దానం చేశారు. ఆ మేరకు ఆన్‌లైన్ భారం తగ్గితేనే బోధనపై దృష్టి పెట్టే అవకాశముంటుందని ఉపాధ్యాయులు, ప్రజలు అంటున్నారు.

తొలగని మధ్యాహ్నభోజనం యాప్

పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం తీరుపై ఫొటోలు తీసి వాటిని యాప్‌ద్వారా ఆప్‌లోడ్ చేయాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదే. రోజూ ఇద్దరు ఉపాధ్యాయులు యాప్‌లను నిర్వహించాల్సి ఉంటుంది. మధ్యాహ్న భోజనం పర్యవేక్షణ చేయాల్సిందేనని, కానీ యాప్‌లో ఆప్‌లోడ్ చేయడం ఇబ్బందిగా ఉందని పలువురు ఉపాధ్యాయులు అంటున్నారు. ఈ యాప్‌ల నిర్వాహణకు విద్యాశాఖ మరో యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందంటున్నారు. లేకపోతే ఉపాధ్యాయులు బోధనకు కాకుండా యాప్‌ల ఆప్‌లోడ్‌కే సమయం వెచ్చించాల్సి ఉంటుందని వాపోతున్నారు.

మరుగుదొడ్ల యాప్ తొలగింపు గౌరవంగా ఉంది



ఉపాధ్యాయులకు మరుగుదొడ్ల ఫొటోలు తీసే యాప్‌ను తొలగించడం గౌరవంగా ఉంది. గతంలో ఉదయం వస్తూనే మరుగుదొడ్ల వద్దకు వెళ్లి ఫొటోలు తీసుకుని ఆప్‌లోడ్ చేయాల్సి ఉండేది. ఇది రోజు ప్రారంభంతో ఉండడంతో ఉపాధ్యాయులకు చికాకుగా, ప్రశాంతత లేకుండా చేసేది. ప్రస్తుత ప్రభుత్వం దానిని తొలగించడం ఉపాధ్యాయులకు ఇచ్చే గౌరవంగా ఉంది.

- వెంకటాచలం, ప్రధానోపాధ్యాయుడు, బాలికల ఉన్నత పాఠశాల, కదిరి

బోధనేతర పనులన్నీ తొలగించాలి

ఉపాధ్యాయులకు మరుగుదొడ్ల ఫొటో తీసే యాప్ తొలగించడం హర్షించతగ్గవిషయం. అయితే ఆన్‌లైన్‌లో నివేదికలు పంపడం, మధ్యాహ్నభోజన యాప్ తదితర బోధనేతర పనులు ఉపాధ్యాయులకు ఇంకా ఉన్నాయి. ఉపాధ్యాయులను వాటికి కూడా దూరంగా ఉంచితే, విద్యార్థులకు బోధన విషయంలో మరింత శ్రద్ధ చూపే అవకాశం ఉపాధ్యాయులకు ఉంటుంది.

- త్రిమూర్తి, ఏపీటీఎఫ్ నాయకుడు

ఆంజనేయ వరద గోవిందా..!

● శ్రావణ శనివారం సందర్భంగా భక్తులతో పోటెత్తిన ఆంజనేయ, వెంకటేశ్వర స్వామి ఆలయాలు ● ఆకట్టుకున్న అలంకరణలు



మడకశిరలో అలంకరణలో అభయాంజనేయస్వామి

అలంకరణలో కోట వెంకటేశ్వరస్వామి



హిందూపురం అర్బన్, ఆగస్టు 10: ఆంజనేయ వరదా గోవిందా..ఆపదమొక్కుల వాడా గోవిందా..అంటూ ఆలయాలు మార్మోగాయి. శ్రావణ శనివారం సందర్భంగా ఆంజనేయస్వామి, వెంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారు నుంచే మూలవిరాట్‌లకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పేట వేంకటేశ్వరస్వామి, లక్ష్మీపురం బాలాజీ ఆలయం, శ్రీనివాస టాకీస్ వద్ద వున్న వేంకటేశ్వరస్వామి, మున్సిపల్ కార్యాలయంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో, సూగూరు ఆంజనేయస్వామి ఆలయం, డీఆర్ కాలనీలోని ఆంజనేయస్వామి, శ్రీకంఠపురం ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు.

మడకశిర రూరల్ : శ్రావణ శనివారం సందర్భంగా భక్తరహళ్లి నరసింహస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లేడకుంట ఆంజనేయస్వామిని రథంపై ఊరేగించి మొక్కులు తీర్చుకున్నారు.

గుడిబండ : మండలంలోని తిమ్మాపురం, కొంకల్లు, బీటీపల్లి, హిరేతుర్పి, తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామికి శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిమ్మలాపురంలో ఆంజనేయస్వామిని మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పెనుకొండ రూరల్ : శ్రావణశనివారం సందర్భంగా మండలవ్యాప్తంగా వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెనుకొండ : శ్రావణ శనివారం సందర్భంగా పట్టణంలో పురాతనమైన లక్ష్మీ వెంకటరమణస్వామి, చెరువు సమీపంలోని దక్షిణముఖ ఆంజనేయస్వామి, ఊరువాకిలి ఆంజనేయస్వామి, ఘనగిరి సోమేశ్వరస్వామి, వజ్రముష్టి ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

గోరంట్ల : శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా కొండాపురం, బూదిలి, గోరంట్ల ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. వానవోలు లో కస్తూరి రంగనాథస్వామిని వెన్నతో అలంకరణ ఆకట్టుకుంది.

మడకశిరటౌన్ : పట్టణంలోని మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ఆకుపూజ అలంకరణ, విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనేక మంది భక్తులు కాలినడకన కావలికొండను ఎక్కి ఆంజనేయస్వామికి మొక్కులు తీర్చుకున్నారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

పావగడ : ప్రసిద్ధి చెందిన పావగడలో శ్రావణ శనివారం సందర్భంగా శనైశ్చరుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

మడకశిర(అమరాపురం) : అమరాపురం మండల కేంద్రంలోని వివిధ దేవాలయాల్లో శనివారం శ్రావణమాసం పూజలు ఘనంగా నిర్వహించారు.



హిందూపురంలో బంగారు కిరీటంతో అలంకరణ



పావగడలో పూజలందుకుంటున్న జ్యేష్ఠాదేవి సమేత శనీశ్వరుడు



వానవోలులో వెన్నతో అలంకరణలో కస్తూరి రంగనాథస్వామి



కోనాపురంలో ...



పెనుకొండలో...



రథంపై జిల్లేడగుంట ఆంజనేయస్వామి



పావగడలో శనీశ్వరుడి దర్శనానికి వేచియున్న భక్తులు



అమరాపురంలో..



తిమ్మలాపురంలో పూజలు నిర్వహిస్తున్న గుండుమల

అంబేడ్కర్ విగ్రహాలను తాకే అర్హత లేదు

● వైసీపీ నాయకులపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మడకశిరటౌన్, ఆగస్టు 10 : ఐదేళ్ల వైసీపీ పాలనలో మాజీ సీఎం జగన్ రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారని, దళితులను మోసం చేసిన ఆ పార్టీ నాయకులకు అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత లేదని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మడకశిర పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విజయవాడ ప్రధాన సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం జగన్ పేరు ఉన్న శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారన్నారు. ఆ నిందను ముఖ్యమంత్రి చంద్రబాబుపై నెట్టడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. అమరావతిలోని అంబేడ్కర్ స్మృతి వనంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయం మీకు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. విజయవాడలో రూ.170 కోట్లతో చేపట్టిన అంబేడ్కర్ విగ్రహం ఖర్చు రూ.404 కోట్లకు చేరిందని, అప్పట్లో రూ.258 కోట్లు వైసీపీ నేతలు స్వాహా చేసినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అంబేడ్కర్ విదేశీ విద్య పేరుతో పేద విద్యార్థుల అభివృద్ధి కొరకు ప్రవేశపెట్టిన పథకాన్ని ఆపేసి అన్యాయం చేశారన్నారు. దళితుల పథకాలను రద్దు చేసి మోసం చేశారని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సోషల్ మీడియా, సొంత చానళ్లలో దళితుల మనోభావాలను రెచ్చగొట్టే విధంగా ప్రయత్నిస్తున్నారని, అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు నమ్మరన్నారు.

కారు చోరీపై కేసు నమోదు

గోరంట్ల, ఆగస్టు 10: కారు చోరీపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పాలసముద్రం సమీపంలోని కుబేరా హిల్స్‌లోని కోరియాన్ రెస్టారెంట్ వద్ద ఈనెల 8న రాత్రి కోరియాకు చెందిన వ్యక్తి రూ.14లక్షల విలువ చేసే కియా కారును ఉంచారు. రెండు రోజులు గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెస్టారెంట్ మేనేజర్ శ్రీకాంత్ నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

హిందూపురం, ఆగస్టు 10 : పోలీసుల కళ్లుగప్పి కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సెబ్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హిందూపురం పట్టణం మోడల్ కాలనీకి చెందిన నవీన్ అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రం చింతలపల్లి నుంచి పది బాక్సుల మద్యాన్ని తరలిస్తున్నాడు. తనిఖీల్లో భాగంగా కొటిపి వద్ద స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్రవాహనం సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ రాజశేఖర్ గౌడ్ తెలిపారు.

పత్తి పంట ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

అగళి, ఆగస్టు 10 : మండలంలోని కింకెర గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు పత్తిపంటను ధ్వంసం చేశారని బాధితుడు నరసింహ రాజు, భార్య శిల్ప ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ 85సెంట్ల భూమిలో పత్తిపంట సాగుచేశామన్నారు. లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టామని, పంట చేతికి వచ్చే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పంట ధ్వంసం చేశారని కన్నీటిపర్యంతమయ్యారు. స్పందించిన ఎస్ఐ వీరేష్ సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన విషయాలను ఆరా తీశారు. 85సెంట్ల పత్తిపంటలో 20 సార్ల వరకు పంట ధ్వంసం చేశారని ఎస్ఐ తెలిపారు. న్యాయం చేయాలని బాధితులు విలపించడం అందరినీ కన్నీరు పెట్టించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



కత్తిరించిన పత్తి పంటను చూపుతున్న బాధితులు

పాఠశాలలో సమస్యలు పరిష్కరించండి

● మంత్రి సవితకు తురకలాపట్నం గ్రామస్థుల వినతి

పెనుకొండ రూరల్, ఆగస్టు 10 : తమ ఊరి పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని మంత్రి సవితను తురకలాపట్నం గ్రామస్థులు కోరారు. శనివారం పట్టణంలోని మంత్రి సవిత నివాసం వద్దకు తురకలాపట్నం వాసులు చేరుకుని పలు సమస్యలను వివరించారు. పాఠశాల పాత భవనం పడిపోవడంతో విద్యార్థులు పాఠశాల ఆరుబయటే కూర్చుని చదుకునే దుస్థితి ఏర్పడిందని, వర్షాకాలంలో మరింత ఇబ్బంది పడుతున్నారని వారు మంత్రికి తెలిపారు. బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. స్కూల్ కమిటీ ఛైర్మన్ ఈడిగ నరసింహులు, వైస్ ఛైర్మన్ బోయ పుష్ప, టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాఠశాల సమస్యపై మంత్రి సవితకు వివరించారు. స్పందించిన మంత్రి అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



సమస్యలను మంత్రికి వివరిస్తున్న గ్రామస్థులు

తేలు కాటుకు బాలుడి మృతి

కొత్తచెరువు, ఆగస్టు 10: మండల కేంద్రంలోని పాత బీసీకాలనీలో నివాసముం టున్న పాణ్యం హరికృష్ణ, అశ్విని కుమారుడు జగదీశ్(8) తేలు కుట్టి మృతిచెందిన సంఘ టన ఆలస్యంగా తెలిసింది. సీఐ రాజారమేశ్ శనివారం తెలిపిన మేరకు... చిన్నారి జగదీశ్ గత నెల22న బీసీకాలనీలో ఇంటి ఎదుట ఆడుకుంటుండగా కాలికి ఏదో విషపురుగు కుట్టిందని తల్లిదండ్రులకు తెలిపాడు. వారు చికిత్స కోసం అతడిని పుట్టపర్తి జనరల్ ఆస్ప త్రికి, సూపర్ స్పెషల్ ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతపురం వైద్యులు పరీక్షించి విషపు తేలు కుట్టిందని బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో వారు ఆర్డీటీకి తీసుకెళ్లారు. అయితే అక్కడి వైద్యుల సూచనల మేరకు బెంగళూర్ ఇందిరా గాంధీ చిల్డ్రన్ ఆస్పత్రికి తరలించగా అక్కడ రెండు వారాల పాటు వైద్య చికిత్సలు అందించారు. అయినా పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ తెలిపారు. బాలుడి తాత సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని సీఐ తెలిపారు.

వర్షం కోసం పూజలు

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 10 : మండల పరిధిలోని బోరంపల్లిలో వర్షం కోసం గ్రామస్థులు ప్రార్థనలు చేస్తున్నారు. శనివారం స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవుడి ఫొటోతో భజనలు చేస్తూ ఏడు గ్రామాల్లో పాదయాత్ర చేశారు.

రేషన్ దుకాణం ప్రారంభించిన నిమ్మల



రేషన్ దుకాణం ప్రారంభిస్తున్న నిమ్మల

గోరంట్ల, ఆగస్టు 10: మండలంలోని పుట్టగుండ్లపల్లి పంచాయతీలోని కొత్తపల్లిలో చౌకధాన్యపు దుకాణాన్ని మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప శనివారం ప్రారంభించారు. అనంతరం లబ్దిదారులకు నిత్యావసరాలు అందజేశారు. మాజీ జడ్పీటీసీ గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గంగాద్రి, సాయిప్రసాద్, శీనా, డీలర్ పాపన్న, వెంకటశివప్ప, సూర్యప్రకాష్‌రెడ్డి, హనుమంతురెడ్డి, చెంద్రాయప్ప, శ్రీరామప్ప, శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థులు

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 10 : పరిగి మండల పరిధిలోని శాసనకోట పాఠశాలకు చెందిన నస్రీన్, చరణ్య, మదీహ, మధుర, తన్వితరెడ్డి, మీన 'పెంకాక్‌సిలాట్' యుద్ధకళలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపారు. నెల్లూరు, పుత్తూరు, ఒంగోలులో ఉత్తమ ప్రదర్శన ఇచ్చి సౌత్ జోన్ పోటీలకు కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం, పాండిచ్చేరి, కర్ణాటకలోని శివమొగ్గ పోటీల్లో పాల్గొని బంగారు పథకాలను సాధించారు. త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దాతలు ఎవరైనా ముందుకొచ్చి ఆర్థిక సాయం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని కోచ్ జనార్దన్‌రెడ్డి తెలిపారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం

హిందూపురం అర్బన్, ఆగస్టు 10: అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్నదానం చేయడం మహా కార్యమని స్వతంత్ర సమరయోదుడు కల్లూరు సుబ్బరావు మనవడు కల్లూరు ప్రభుకుమార్ పేర్కొన్నారు. శనివారం యోగినారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమంలో తన వంతు సాయంగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తాత స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపడ్తానన్నారు. 28 రోజులుగా నిత్యాన్నదానం చేపడ్తున్నామని యోగినారాయణ సేవాసమితి హిందూపురం శాఖ అధ్యక్షుడు రవిశంకర్ తెలిపారు. కార్యక్రమంలో సేవా కర్తలు, గొల్లన్న, వెంకటేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న దాతలు

నడిరోడ్డుపైనే మురుగునీరు

మడకశిర(అమరాపురం), ఆగస్టు 10: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో నడిరోడ్డుపైనే మురుగునీరు పారుతోంది. స్థానిక గొల్లహట్టి వీధిలో వర్షం వస్తే డ్రైనేజీ నీరు వర్షపు నీరు కలిసి దుర్గంధంగా తయారవుతోంది. రోడ్డుపై మురుగునీరు పారడంతో రోగాల బారిన పడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల నుంచి బయటకు వదిలే మురుగునీరు రోడ్లపైనే నిలబడుతోంది. అందులో చెత్తా చెదారం చేరి కుళ్లిన వాసన భరించలేని విధంగా ఉందని వారు వాపోతున్నారు. కొన్ని వీధుల్లో దాటు కోవడానికి వీలులేని విధంగా తయారయింది. గ్రామ సచివాలయం సమీపంలోని గొల్లహట్టి రోడ్డులో ప్రజలు కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. రోడ్డుపైనే నీరు నిలిచి కంపు కొట్టడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ శివకుమార్, శ్రీనివాస్ యాదవ్, గౌడప్ప, తిప్పజ్జ, మారప్ప, మహలింగప్ప, తదితరులు కోరారు.



రోడ్డుపైనే నిలిచిన మురుగు నీరు

వైభవంగా పల్లకి సేవ

ఉరవకొండ, ఆగస్టు 10: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. తర్వాత ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. శ్రావణ మాసం మొదటి శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



పతాకావిష్కరణ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పెనుకొండ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీజీ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. పతాకాన్ని ఎగురవేసి ఘనంగా సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఉపేంద్ర, గంగాధర్, మారుతి, ఆదిజినేష్, శివ, శీన, కాశీ, రాజశేఖర్, చిన్న వెంకటేశ్, వినోద్, శేషాద్రి, రామాంజినేయులు పాల్గొన్నారు.

మడకశిరటౌన్ : పట్టణంలోని కేపీ పాఠశాల ఆవరణంలో యూటీఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను యూటీఎఫ్ నాయకులు ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ ఆవిర్భవించిందని, నాటి నుంచి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం నిరంతరం పోరాడుతుందన్నారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మాలింగప్ప, వై.జోగప్ప, ఈశ్వర్, కదురప్ప, హనుమంతరాయప్ప, నంజప్ప, శివశంకర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో బసవపంచమి

పావగడ, ఆగస్టు 10 : తాలూకా పరిధిలోని ముగదాలబెట్ట రాష్ట్ర ప్రగతి ఉన్నత పాఠశాలలో శనివారం బసవపంచమిని నిర్వహించారు. విద్యార్థులకు పాఠశాల సిబ్బంది, టీచర్లు పాలు పంపిణీ చేసి తాగించారు. మానవ బంధుత్వ వేదిక సభ్యుడు పాలేదార్ లోకేష్ మాట్లాడుతూ మనిషిలో చైతన్యం కలిగించడమే తమ సంస్థ ధ్యేయమన్నారు. వేదిక కన్వీనర్ ఓంకారనాయక, టీచర్లు నరసింహమూర్తి, ఆనందప్ప, గోవిందరెడ్డి, తిప్పేస్వామి, నరసింహయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

శాశ్వత భవనం నిర్మించాలని వినతి

మడకశిర(అమరాపురం) : అమరాపురం మండల పరిధిలోని హేమావతి పంచాయతీ కెంకెర గ్రామం ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ-2కు శాశ్వత భవనం నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అద్దెభవనాల్లో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని, కెంకెర గ్రామ కాలనీ వాసులు దేవరాజు, మంజునాథ్, జయన్న, గోపాల్, నింగేగౌడ్, తిప్పేస్వామి, గిరిష్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

13న స్నాతకోత్సవం

గోరంట్ల, ఆగస్టు 10: మండలంలోని కమ్మలవాండ్లపల్లి సమీపాన గల 'బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ'లో ఈనెల 13న రెండో స్నాతకోత్సవం నిర్వహించనున్నట్లు వీసీ డాక్టర్ సుబ్రహ్మణ్య యడపతితాయ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు జీసీ సభ్యులు ఇండియా ఫౌండేషన్ శౌర్యదోవల్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. విద్యాలయం పోషకులు భరత్‌లాల్‌మీనా, చాన్సలర్ డాక్టర్ రూపావాసుదేవన్ ఆధ్వర్యంలో కాన్వకేషన్ నిర్వహించి, ముగ్గురికి బంగారు. ఇద్దరికి వెండి పతకాలు అందజేస్తామన్నారు.

ఆరాధన ఉత్సవాలు ప్రారంభం

పెనుకొండ, ఆగస్టు 10 : పట్టణ సమీపంలోని లక్ష్మీకాంత తీర్థుల బృందావనంలో స్వామివారి ఆరాధన ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉత్తరారాధన, స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పవమాన హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి రూ. 50వేల విరాళం

గోరంట్ల, ఆగస్టు 10: మండలంలోని వానవోలు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కస్తూరి రంగనాథస్వామి ఆలయానికి శనివారం పాలసముద్రం గ్రామానికి చెందిన రంగేనాయక్ దంపతులు రూ.50,116 విరాళం అందించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు